# టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉద్యోగాలకు బాటలు



## జర్మనీలో లక్షల ఉద్యోగాలు.. యువతకు భారీ అవకాశాలు

## గిగ్ వర్కర్స్ యాక్ట్ దేశానికి ఆదర్శం : మంత్రి వివేక్

**హైదరాబాద్, ఏప్రిల్15, ప్రభాతవార్త:** రాష్ట్ర యువతకు విదేశాల్లో విస్తృతమైన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభు త్వం కట్టుబడి పనిచేస్తోందని కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఓవర్సీస్ మాన్ పవర్ కంపెనీ ద్వారా యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి వివరించారు. జర్మనీ దేశంలో ప్రతి ఏడాది సుమారు 5 లక్షల ఉద్యోగాల అవసరం ఉన్నదని, ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం 90 వేల వీసాలు జారీ చేయడానికి ఆ దేశం ముందుకు వచ్చిందని వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రతి సంవత్సరం 25 వేల మంది యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో నాలుగు నెలల్లోనే జర్మన్ భాష శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ప్రైవేటు ఏజెన్సీల మాయమాటలకు లోనై మోసపోవద్దని యువతకు మంత్రి హెచ్చరించారు. విదేశాల్లో భారతీయ యువతకు మంచి అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా భారతీయులు అక్కడి చట్టాలను గౌరవిస్తూ కష్టపడి పనిచేస్తారనే మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. జర్మనీలో ఉద్యోగాల ద్వారా నెలకు రూ.2 లక్షలకు పైగా వేతనాలు పొందే అవకాశం ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ దిశగా ముందుకు సాగుతోందని, ఇప్పటికే లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని మంత్రి తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువత టామ్‌కామ్ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన గిగ్ వర్కర్స్ యాక్ట్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

# వ్యవసాయ మార్కెట్లలో జీరో బిజినెస్‌పై కఠినచర్యలు

## యార్డుల్లో యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపాయాల కల్పన

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుల్లో జీరో బిజినెస్ అంశంపై రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనలను పాటించని, జీరో బిజినెస్ చేసే వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. వ్యాపారులకు సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డుల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వివరించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతీ పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగం గా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల



పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గడ్డిఅన్నారం మార్కెట్‌లో స్మార్ట్ మార్కెట్ యార్డు అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని నిర్దేశించారు. అదేవిధంగా.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు మంత్రికి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు.





సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినమ్ జూబ్లీ లోగోను ఆవిష్కరిస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

# సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శన

## ప్రారంభించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరారాబాద్ (చార్మినార్), ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** కేంద్ర సాంస్కృతిక శాఖ, సాలార్‌జంగ్ మ్యూజియం, రుమాలే ఆర్ట్ హౌస్ బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో సాలార్‌జంగ్ మ్యూజియంలో బుధవారం ఏర్పాటు చేసిన రుమాలే ఫొటో ప్రత్యేక ప్రదర్శనను గవర్నర్, సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు చైర్మన్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. రుమాలే ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన అరుదైన ఫోటోలను గవర్నర్ శివప్రతాప్ శుక్లా తిలకించారు. సాలార్‌జంగ్ మ్యూజియం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్లాటినమ్ జూబ్లీ లోగో,పోస్టర్స్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగ్రహాలయాలు వల్ల రాబోయే తరాలు వారికి ఎంతో లాభం కలుగుతుందని తెలిపారు. మ్యూజియం ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలు సందర్భంగా సాలార్‌జంగ్ మ్యూజియంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినందుకు అభినందిస్తున్నాని ఆయన తెలియజేశారు. ఎగ్జిబిషన్‌లోని చిత్రాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ఆయన తెలిపారు.హైదరాబాద్ నగరంలో విభిన్న సంస్కృతులకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని,దేశంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడ పని చేస్తున్నారని,అందరం కలిసి ఐకమత్యంగా ఉంటున్నామని ఆయన తెలియజేశారు.

కాగా బెంగుళూరు చెందిన చిత్రకారుడు రుమాలే రూపొందించిన దాదాపు డబ్బై పలు రకాల చిత్రాలను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు.మే నెల 25వ తేదీ వరకు సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ ప్రత్యేక ప్రదర్శన కొనసాగుతుంది.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురబి.వాణి దేవి, ప్రిన్సిపల్ సెక్రటరీ గవర్నర్ దాన కిశోర్,రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ చాంద్ పండిత్,సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ప్రియాంక మేరీ ఫ్రాంచీస్,రుమాలే ఆర్ట్ ఎగ్జిబిషన్ క్యూరేటర్ కె.ఎస్,శ్రీనివాస్ మూర్తి,రుమాలే ఆర్ట్ హౌస్ ప్రతినిధి సంజయ్ కాబే,సాలార్‌జంగ్ మ్యూజియం క్యూరేటర్ బి.ఆర్.నాయక్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 17 నుంచి అబ్‌స్టకల్ లిమిటేషన్ సర్వే

## రక్షణ, పౌర విమాయానం, ప్రభుత్వం ఉమ్మడి కసరత్తు

**హైదరాబాద్, ఏప్రిల్15, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ విమానాశ్రయం దీర్ఘకాలిక డిమాండ్ కార్యరూపం దాల్చే క్షణాలు దాదాపు సమీపిస్తున్నాయి. రక్షణ, పౌర విమానయాన శాఖలు, రాష్ట్రప్రభుత్వం ఉమ్మడిగా శుక్రవారం నుంచి క్షితిజ సమాంతర ఆటంక పరిమితి సర్వేను (అబ్‌స్టకల్ లిమిటెడ్ సర్వే) చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నాయి. పౌరవిమానయానశాఖ కు చెందిన సాంకేతిక నిపుణులు ముందుగా పెగ్‌మార్కింగ్ చేయబోతున్నారు. ఏడు నుంచి ఎనిమిది రోజుల వరకు సాంకేతిక నిపుణులు ప్రతిపాదిత విమానాశ్రయం ప్రాంతంలో సర్వేచేయబతోన్నారు. విమానాశ్రయ ప్రాతంలో క్షితిజ సమాంతర ఉపరిత ఆటంక పరిమితులు ఉంటే ఎలా ఉన్నాయి లేకపోతే సాఫీగా ఎలా ఉందో తెలియజేస్తు నివేదిక ఇవ్వడానికి సుమారు రెండు నెలల సమయం తీసుకొంటారు. ఆదిలాబాద్ విమానాశ్రయంను 820 ఎకరాలలో నిర్మించేందుకు రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ నివాసంలో గత బుధవారం కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, కె.రాంమోహన్ నాయుడు నలుగురు మంత్రులు సమావేశమై సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చారు. రక్షణ శాఖకు చెందిన 370 ఎకరాలభూమి ఉన్నప్పటికి మిగితా 450ఎకరాల భూమిని సేకరించే బాధ్యత రాష్ట్రప్రభుత్వానికి అప్పగించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఇండియా, రక్షణశాఖ ఉమ్మడిగా ఈ విమా నాశ్రయాన్ని నిర్వహించడానికి పరస్పరం అంగీకారానికి వచ్చాయి.

ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ శిక్షణా కార్యక్రమాలకు ఈ విమానాశ్రయం వాడు కోబోతుంది. తెలంగాణలో హైదరాబాద్ మినహా ఎక్కడ కూడా విమానాశ్రయాలు లేవు. దీనితో వరంగల్, ఆదిలాబాద్, జాక్రన్‌పల్లి, బసంత్‌నగర్‌లో విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ పెరిగిపోతున్నది.

రక్షణ శాఖ, పౌర విమాన శాఖ, రాష్ట్రప్రభుత్వం ఉమ్మడిగా ప్రతిపాదిత విమానాశ్రయంలో ఆటంక పరిమితి సర్వేను చేపట్టి ల్యాండింగ్, టేకాఫ్ వంటి విమాన కార్యకలాపాల భద్రత, సామర్థ్య నిర్థారణను అధ్యయనం చేస్తారు. విమానాశ్రయం సమీపంలో భవనాలు, పర్యావరణ వంటి సున్నిత అంశాలు విమానం ఢీకొనేందుకు వీలుగా ఉన్నాయా అనే అంశంపై కూడా నిపుణులు అధ్యయనం చేయబోతున్నారు. విమానాలు పొరపాటున రద్దీగా ఉండే ప్రాంతాల్లో దిగకుండా, బయలుదేరేప్పుడు ఢీకొనకుండా విమాశ్రయం చుట్టు రక్షణకవచంగా వెలుపలి పరిధి నుంచి పైకి బయటకు విస్తరించి ఒక శంఖాకార ఉపరితలం ఉంటుంది. విమానాలు ప్రమా దం బారిన పడకుండా సురక్షితంగా నడిపించే సంభావ్యతను కలిగి ఉంటుంది.

# రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ జావేద్ మృతి



## డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి దిగ్భ్రాంతి

## నివాళులర్పించిన పువ్వాడ అజయ్, పలు పార్టీల నేతలు

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. తన సొంత కారులో ఖమ్మం నుండి హైదరాబాద్ వెళుతుండగా సూర్యాపేట సమీపంలో డివైడర్ కు ఢీకొని పక్కనే ఉన్న పొలంలోకి కారు తీసుకువెళ్లి పల్టీ కొట్టడంతో జావీద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయన దుర్మరణం చెందారని విషయం తెలుసుకున్న ఖమ్మం కాంగ్రెస్ నాయకులు,ఆయన అభిమానులు, స్నేహితులు కార్యకర్తలు హుటాహుటిన సూర్యాపేటకు తరలి వెళ్లారు. సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జావిద్ ను చూసి కన్నీరు మున్నీరయ్యారు. అనంతరం అక్కడి నుండి ఖమ్మంలోని తన స్వగృహానికి జావిద్ మృతదేహాన్ని తరలించారు.జావిద్ కి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జావీద్ మృతి పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా మోతే వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జావేద్ మరణించారన్న వార్త తమను తీవ్రంగా కలచివేసిందని మంత్రులు పేర్కొన్నారు. అదేవిధంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జావిద్ మృత్యాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు జిల్లాకు చెందిన పలువురు ఎంపీలు ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు జావిద్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వెలిబుచ్చారు అంతేకాకుండా పలు పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు జావిద్ మృదయానికి నివాళులర్పించారు.

### ఖమ్మం రాజకీయాల్లో జావేద్‌ది చెరగని ముద్ర

చిన్నతనం నుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ అంచలంచెలుగా ఎదిగిన మహమ్మద్ జావిద్ మృతి చెందడం ఆ పార్టీ కార్యకర్తలను విస్మయానికి గురిచేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో జావీద్ కాంగ్రెస్ ఖమ్మం నగర అధ్యక్షుడిగా ఉండి అనేక ఉద్యమాలకు, పోరాటాలకు శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ ఖమ్మం నియోజకవర్గం లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ప్రజలలో సంపాదించుకున్నాడు. నిస్వార్థపరుడు,నిగర్వి అందరితో కలిసిమెలిసి ఉండే జావీద్ అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఖమ్మం కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్ర విచారాన్ని కలిగించింది. సోమవారం ఖమ్మం లోని డిసిసి కార్యాలయంలో జరిగిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న జావీద్ అంతలోనే తమను వదిలి వెళ్తాడని ఎవరు ఊహించలేదు. రాజకీయాలకి అతీతంగా అన్ని పార్టీల నాయకులతో, కార్యకర్తలతో సత్సంబంధాలు కలిగిన వ్యక్తి జావీద్. వివాదాస్పద రహితుడిగా ప్రతి ఒక్కరితో కలివిడిగా ఉండే జావీద్ మరణం అందరిని కలిసివేసింది.ఖమ్మం రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జావేద్, పార్టీ కోసం నిరంతరం అంకితభావంతో పనిచేశాడు.ప్రజా సమస్యలపై స్పందించే గుణం, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే నేర్పు కలిగిన నాయకుడు జావేద్. ఆయన మరణం కాంగ్రెస్ శ్రేణులకు తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. జావేద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# సిఎం రేవంత్‌పై జీవన్ విమర్శలు దిగజారుడుతనానికి నిదర్శనం

## ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తెలంగాణను ప్రజారంజకంగా పాలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై జీవన్‌రెడ్డి విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన దిగజారుడుతానికి నిదర్శనమని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం సిఎల్‌పి కార్యాయలంలో మీడియాతో మాట్లాడుతూ జీవన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి 14 సార్లు బిఫారం తీసుకొని కొన్ని సార్లు గెలిచారని అనేకసార్లు ఓటమిపాలైనారని ఇదంతాకాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష కారణంగానే జీవన్‌రెడ్డి ఈ స్థాయికి చేరుకున్నారనీ ఆయన వివరించారు. ఈ విషయాలు మరిచిపోయి కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం గురించి నోటీకొచ్చినట్లు మాట్లాడుతు న్నాడనీ ఆవేదన చెందారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గా మారిందని జీవన్ రెడ్డి విమర్శిస్తున్నారు,కాని జీవన్ రెడ్డి కల్వకుంట్ల ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో చేరుతున్న విషయాన్ని మరిచిపోయినట్లున్నాడనీ ఎద్దేవా చేశారు.ఆ కంపెనీలో కెసిఆర్ కెటిఆర్ తప్పితే మరొకరు ఉండరన్న సంగతి జీవన్ రెడ్డి కి తెలియదా? కన్న కూతురు ను కూడా ఆ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి పంపించిన విషయం పెద్దాయకు అర్థం కాలేదా? అన్నారు..ఆత్మాభిమానం, ఆత్మగౌరవం కోసం ఎవరైనా కెసిఆర్ తో చేతులు కలుపుతారా అని సందేహం వ్యక్తంచేశారు.కాళేశ్వరాన్ని కూలేశ్వరంగా మార్చిన కెసిఆర్‌ను వదిలేశాడు. మేడిగడ్డ రిపేర్ చేయకపోతే రేవంత్‌రెడ్డిని వచ్చే తరాలు క్షమించవని జీవన్‌రెడ్డి మాట్లాడటం ఆయన దిగజారుడుతనాన్ని తెలియజేస్తుందనీ అన్నారు. మేడిగడ్డ ఎందుకు కూలిందో ముందు కెసిఆర్‌ను జీవన్ రెడ్డి నిలదీయాలనీ డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్ష మేరకే బిఆర్‌ఎస్ లో చేరుతున్నానని జీవన్ రెడ్డి అంటున్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ పార్టీ అవసరమే లేదని ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. జీవన్‌రెడ్డి బిఆర్‌ఎస్‌లో చేరడంతోనే ఆయన రాజకీయ చరిత్ర భూస్థాపితమైందనీ, జగిత్యాల ప్రజలు కూడా జీవన్‌రెడ్డి నిర్ణయాన్ని వ్యతి రేకిస్తున్నారనీ అన్నారు.

# బిజెపి నేత రామకృష్ణారెడ్డి ఆత్మహత్య

## పార్టీ నేతల దిగ్భ్రాంతి.. మృతిపై విచారణ జరుపుతున్న పోలీసులు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో అవినీతిపై అవిశ్రాంత పోరాటం చేస్తున్న బడంగ్‌పేట్ సెక్టార్ బిజెపి అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. తన నివాసంలోనే ఆయన ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడడం కలకలం రేపింది. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొ రేషన్‌లో జరిగిన కోట్లాది రూపాయల అవినీతిపై అదేవిధంగా విలీన సమయంలో జరిగిన భారీ అక్రమాలపై, బాలాపూర్ పరిధిలో అక్రమంగా నివసిస్తున్న వేలాదిమంది రోహింగ్యాలపై, సుల్తాన్‌పూర్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మద ర్సాలపై ఆయన అలుపెరగని పోరాటం చేశారు. తత్ఫలితంగా విజిలెన్స్, ఎసిబి విచారణల నేపథ్యంలో డిప్యూటీ కమిషనర్ సరస్వతితో పాటు మొత్తం పది మంది అధికారులు సస్పెండ్ అయ్యా రు. అవినీతి అక్రమాలపై పోరాడుతూనే నిరంతరం పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండే రామకృష్ణారెడ్డి బుధవారం తన నివాసం లోనే విగతజీవుడై ఉండడం కలకలం రేకెత్తించింది. స్వగ్రామం బడంగ్‌పేట్‌కు ఆనుకొని ఉన్న నాదర్‌గుల్‌లోని కింగ్స్‌వే విల్లాస్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్న రామకృష్ణారెడ్డి బుధవారం ఉదయం బెడ్‌రూం నుండి బయటకు రాకపోవడంతో గమనించిన భార్య స్వప్న తలుపుతట్టినా స్పందన లేకపోవడంతో బడంగ్‌పేట్‌లోని అత్తామామలకు ఫోన్ ద్వారా సమాచారం అం దించింది. దీంతో మామ రాళ్లగూడెం లక్ష్మారెడ్డితోపాటు పలువురు హుటాహుటిన నాదర్‌గుల్‌కు చేరుకొని స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో రామకృష్ణారెడ్డి వేలాడుతుండడం కనిపించింది. కిందకు దింపి చూడగా అప్పటికే విగతజీవునిగా కనిపించాడు. సమాచారం అందుకున్న స్థానిక మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌కుమార్‌నాయక్, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. శవ పంచనామా జరిపి తండ్రి లక్ష్మారెడ్డి నుండి ఫిర్యాదు తీసుకున్నారు. రామకృష్ణారెడ్డి ఆత్మహత్యకు గల కారణాలపై మీర్‌పేట్ పోలీసులు దర్యాప్తు ప్రారం భించి ఆరా తీస్తున్నారు. చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బడంగ్‌పేట్‌కు వచ్చి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి (ఫైల్)

# గ్రామీణాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు రూపొందించండి : మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేసేలా వినూత్నమైన కార్యక్రమాలను రూపొందించాలని తెలంగాణ గ్రామీ ణాభివృద్ధి సంస్థ (టిజిఐఆర్‌డి) నిపుణులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. టిజిఐఆర్‌డిలో ఎంతో మంది నిపుణులున్నారని గుర్తు చేశారు. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు స్థానిక సంస్థల విధులు, నిధులు, హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు సులభంగా అర్థమయ్యే శిక్షణ మెటీరియల్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తమ హక్కులు భాధ్యతలు తెలియచెబితే గ్రామాల అభివృద్ధి సంపూర్ణమవుతుందని తెలిపారు. ఈ మేరకు టిజిఐఆర్‌డి నిర్వహిస్తున్న కార్యక్రమాలపై రాజేంద్రనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎజెన్సి ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాలపై స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులకు అవగాహన పెంపొందించే దిశగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలనుటిజిఐఆర్‌డి ద్వారా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ అమలులో ఖచ్చితత్వం ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సంస్థలో మౌళిక సదుపాయాల అభివృదిలో భాగంగా ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిరంగాల్లో అత్యున్నత శిక్షణా సంస్థగా పేరు గాంచిన టిజిఐఆర్‌డి ప్రతిష్ఠను నిలబెట్టేలా సిబ్బంది మరింత కట్టుదిట్టంగా పనిచేయాలని సూచించారు. సంస్థ ద్వారా అందించే శిక్షణలు గ్రామీణ పాలనలో నాణ్యతను పెంచేలా ఉండాలని ఆమె ఆకాంక్షి ంచారు. ఈ సమీక్ష సమావేశంలో గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి సంజయ్ కుమార్, టిజిఐఆర్‌డి సిఇఒ కె. నిఖిలతోపాటు ప్రొఫెసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంస్థలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల పురోగతిని సీఈఓ నిఖిల మంత్రి సీతక్కకు వివరించారు. టీజీ ఐఆర్డీ ద్వారా ఇప్పటివరకు వివిధ విభాగాల పరిధిలో చేపట్టిన శిక్షణల ఫలితాలు, వాటి ప్రభావం గురించి కూడా వివరించారు. ముఖ్యంగా, శిక్షణ పూర్తి చేసిన మాస్టర్ ట్రైనర్లు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు, ప్రస్తుతం వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

# తెలంగాణ, ఆంధ్ర ఇన్‌కంటాక్స్ చీఫ్‌గా సురేశ్ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సీనియర్ ఐఆర్‌ఎస్ అధికారి బత్తిని సురేశ్ బాధ్యతలు స్వీకరిం చారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లోని ఆదాయపు పన్ను కార్యాలయంలో ఈ బాధ్యతలు చేపట్టారు. బత్తిని సురేష్‌ను తెలుగు రాష్ట్రాల ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా నియమిస్తూ కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) గత గురువారం నియామక ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకూ ఈ బాధ్యతల్లో ఉన్న మోరంపూడి అనిల్ కుమార్ ఇన్‌కమ్ టాక్స్ చీఫ్ కమిషనర్‌గా వ్యవహరిస్తుండగా, ఆయన స్థానంలో సురేశ్‌ను బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. కాగా 1991లో రెవెన్యూ సర్వీసులో చేరిన సురేశ్ గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో ఆదాయ పన్ను శాఖలో ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. గతంలో సురేశ్ కు హైదరాబాద్ రీజియన్‌లో ఆదాయ పన్ను శాఖ చీఫ్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది.

హైదరాబాద్ రీజియన్‌లో ఆదాయ పన్ను శాఖ చీఫ్ కమిషనర్‌గా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. రెండు రాష్ట్రాల్లోని పన్నుల పరిపాలన, ఆదాయ వసూళ్ల లక్ష్యాలు, శాఖాపరమైన అంశాలపై ఆయనకు పూర్తిస్థాయి అవగాహన ఉంది. ఇక రెండు రాష్ట్రాల్లో ఆదాయ పన్ను శాఖకు సంబంధించి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ అనేది అత్యున్నత పదవి కావడంతో పన్ను వసూళ్ల లక్ష్యాలను పర్యవేక్షించడంతో పాటు, చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన పరిపాలనను సమన్వయం చేయడం వంటి ప్రధాన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.

# మహ్మద్ జావేద్ ఆత్మకు శాంతి చేకూరాలి

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌-చార్జి మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్, ఏప్రిల్15, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఖమ్మం మాజీ డిసిసి అధ్యక్షుడు మహ్మద్ జావిద్ రోడ్డు ప్రమాదంలో మృతిచెండటంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో విషాదం నెలకొంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్, ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్ వేర్వేరు ప్రకటనలో మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు. పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ జావిద్ ఆత్మకు శాంతి చేకూ రాలని ఆయనలేని లోటు భరించే శక్తి సర్వశక్తిమంతుడైన దేవుడు వారి కుటుం బానికి కల్పించాలని ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ స్వంత వాహనంలో వస్తుండగా పిల్లలమర్రి వద్ద డివైడర్ ను ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే జావిద్ మృత్యువాత పడటంతో ఒక నిబ్దదత కలిగిన గాంధేయవాధిని కోల్పోయాయని సంతాప సందేశంలో తెలిపారు.చాలా మంచి క్రమశిక్షణ గల నాయకులు మంగళవారం ఆయనను ఖమ్మం సమావేశంలో సన్మానిం చానని జావిద్ మరణవార్త తెలియగానే తీవ్రదిగ్భ్రాంతికి గురైనానని మహేష్ కుమార్‌గౌడ్ గుర్తుచేసుకొన్నారు. జావిద్ కుటుంబ సభ్యు లకు తన ప్రగాఢ సానుభూతి ని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

### గాంధేయవాది మహ్మద్‌జావిద్ : మీనాక్షి నటరాజన్

ఖమ్మం డిసిసి మాజీ అధ్యక్షులు జవీద్ నిబద్ధత కలిగిన గాంధేయవాధి ఆయన మృతి రాష్ట్రంలో పార్టీకి తీరని లోటని ఎఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సంతాపం ప్రకటించారు.అత్యంత క్రమశిక్షణ కలిగిన నాయకులు జవీద్ అని, రాజీవ్ పంచాయతీ రాజ్ సంఘటన లో ఆయన పని చేసా రని, సిద్ధాంతాల పట్ల నిబద్ధత, పార్టీ పట్ల విధేయత ఉన్న నాయకుడనీ ఆమె గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేశారు. అత్యంత విషాద సంఘటనలో వారి కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ఆమె ప్రార్థించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# బిసి బిల్లుతోనే మహిళలకు సబ్‌కోటా

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** మహిళా బిల్లుకు మూలం బీసీ బిల్లు అని, బీసీ బిల్లుకై ఐక్యంగా పోరాడుదామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారని తెలిపారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా రావాలంటే మొదట బీసీ బిల్లు రావాలని, అప్పుడే బీసీ మహిళలకు సబ్‌కోటా వస్తుందని, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు బీసీ బిల్లుకై పోరాడాలని కోరారు. 75 కోట్లకుపైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల డిమాండ్ అయిన కులగణనను కేంద్రం గౌరవించిందని, కుల గణన తరువాత బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల పెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

